క్లుప్తంగా

ఘనంగా శివపార్వతుల కల్యాణోత్సవం



ధన్వాడ: మండల కేంద్రంలోని సాంబట్లతోట ఎన్టీఆర్ కాలనీలో మల్లికార్జున దేవాలయంలో గురువారం శివపార్వతుల కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున 2 గంటల నుంచి 5 గంటల వరకు శివ పార్వతుల కల్యాణం, జ్యోతి ప్రజ్వలన నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అంబత్రయ క్షేత్రంలో శివనామస్మరణ



ఊట్కూరు: మండలంలోని బిజ్వార్‌లో వెలసిన అంబత్రయ క్షేత్రంలో మహాశివరాత్రి సందర్భంగా శివనామస్మరణతో పరిసరాలు మార్మోగాయి. బుధవారం రాత్రి జ్యోతిర్లింగాల మహాపూజ కనుల పండువగా నిర్వహించారు. రుద్రాభిషేకం, అలంకరణ, బిల్వార్చన, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు కృష్ణయ్య, కురుమూర్తి, నర్సింహ, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

నర్సరీని పరిశీలించిన ఎంపీడీఓ



మాగనూర్: మండలంలోని అమ్మపల్లిలో నర్సరీలోని మొక్కలను ఎంపీడీఓ రహ్మతుద్దీన్ గురువారం పరిశీలించారు. వేసవిలో మొక్కలు ఎండిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శి, ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు. వర్షాకాలం సీజన్‌కు సరిపడ మొక్కలు అందించడమే లక్ష్యంగా పని చేయాలన్నారు. వాటర్ ట్యాంకులు పరిశీలించి వేసవిలో గ్రామంలో నీటి సమస్య లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రవి, ఫీల్డ్ అసిస్టెంట్ నరేష్ పాల్గొన్నారు.

నీడ పందిళ్లు ఏర్పాటు చేసుకోవాలి



కొత్తపల్లి: మండలంలోని గ్రామ పంచాయతీలలో పెంచుతున్న నర్సరీలను గురువారం ఎంపీడీఓ కృష్ణారావు, ఎంపీఓ రామన్నతో కలిసి కొత్తపల్లి తండా, నిడ్జింత గ్రామాల నర్సరీలను ఆకస్మిక తనిఖీ చేశారు. వేసవికాలం ప్రారంభం కావడంతో నర్సరీలలో మొక్కలకు షాడో నెట్, నీడ పందిళ్లు తక్షణమే ఏర్పాటు చేసుకోవాలని పంచాయతీ కార్యదర్శులకు, ఫీల్డ్ అసిస్టెంట్లకు ఎంపీడీఓ సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు అజయ్, వెంకటేష్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

మహనీయులను స్ఫూర్తిగా తీసుకోవాలి



ఊట్కూరు: విద్యార్థులు మహనీయుల జీవిత చరిత్రలను స్ఫూర్తిగా తీసుకోవాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏబీవీపీ ఆధ్వర్యంలో వివేకానంద, నేతాజీ యువజన ఉత్సవాల బహుమతుల పంపిణీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువు, విజ్ఞానంతో పాటు దేశభక్తిని కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు రాము, అంజి, శ్రీనివాస్, భాస్కర్ పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికులకు పథకాలు అందాలి

మరికల్: భవన నిర్మాణ కార్మికులకు ప్రభుత్వ పథకాలు అందించాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షులు గోపి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం నుంచి భవన కార్మికులకు గుర్తింపు కార్డులు, అర్హులైన వారందరికి పింఛన్, ప్రమాద బీమా, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. కార్మికుల సమస్యలపై ఏప్రిల్‌లో హైదరాబాద్‌లో నిర్వహించే మహాసభలను జయప్రదం చేయాలని కోరారు.

కృష్ణమ్మ రాకతో తీరిన కష్టాలు



కర్ణాటకలోని నారాయణపూర్ ప్రాజెక్టు నుంచి వదలడంతో కృష్ణానదిలో పారుతున్న నీరు

- కృష్ణానది తీరంలో 14500 ఎకరాల వరిసాగు
- వేసవిలో సాగునీటికి ఇబ్బందులు ఉండవు
- ఎత్తిపోతలకు తొలగిన నీటి తిప్పలు
- నీటి రాకతో అన్నదాతల హర్షం

కృష్ణా: ఉమ్మడి మండలంలోని కృష్ణానది తీరంలో రైతులు యాసంగి పంట 14500 ఎకరాల్లో వరి సాగు చేశారు. పక్షం రోజులుగా నదిలో నీళ్లు లేక రైతులు పంట కాపాడుకోవడానికి గుంతల్లో నీటిని మోటార్ల దాకా జేసీబీల సాయంతో కాల్వలు తవ్వి నీటిని పంటలకు పారిస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ఎగువన కర్ణాటకలోని నారాయణపూర్ ప్రాజెక్టు నుంచి 5 టీఎంసీల నీటిని దిగువకు రెండు రోజుల క్రితం విడుదల చేయించారు. దీంతో కృష్ణా, మాగనూర్ మండలాల్లోని వరిపొలాలతో పాటు మక్తల్, ఆత్మకూర్ ప్రాంత రైతులకు ఎంతో మేలు జరిగింది. కృష్ణా మండలంలో నదితీరంలో 10వేల ఎకరాల వరి సాగు చేయగా, మాగనూర్ మండలంలో 4500 ఎకరాల సాగు చేశారు. ఈ పొలాలకు సరిపడా సాగు నీరు నదిలో రావడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇంకో నెలరోజులు నీళ్లు అందితే చాలని, తమ పంటలు చేతికొస్తాయని రైతులు ఆశాభావం వ్యక్తం చేశారు.

ఎమ్మెల్యేకు రుణపడి ఉంటాం..



ఎండుతున్న పంటలకు సాగునీటిని అందించి ఆదుకున్న ఎమ్మెల్యే శ్రీహరికి రుణపడి ఉంటాం. ఉమ్మడి మండలంలోని రైతుల సాగునీటి సమస్యను ఎమ్మెల్యే గుర్తించి కర్ణాటక ప్రభుత్వంతో చర్చించి తమకు 5 టీఎంసీల నీటిని విడుదల చేయించినందుకు కృతజ్ఞతలు తెలియచేస్తున్నాం. ప్రభుత్వం తమకు అండగా ఉండి మా సమస్యను పరిష్కరించడం ఆనందంగా ఉంది. – భీమశంకర్, రైతు, ముడుమాల్

పంటలకు నీటి ఇబ్బందులు ఉండవు



కృష్ణానదిలో పక్షం రోజులుగా నీళ్లు లేకపోవడం మూలంగా మా పంటలు చేతికి రావనే సందిగ్ధంలో ఉన్నాం. ఆ సమయంలో, ఆపద్బాంధవుడిలా మక్తల్ ఎమ్మెల్యే ప్రత్యేక చొరవతో సాగునీటి సమస్యను పరిష్కరించారు. ఆయనకు, ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం. నేను సాగు చేసిన పంటకు సాగునీటి ఇబ్బంది ఉండదు.

– మేకలి తిమ్మప్ప, రైతు, ముడుమాల్

వైభవంగా శివయ్య రథోత్సవం



మాగనూర్: మండలంలోని వాడ్వట్‌లో మహాశివ రాత్రి సందర్భంగా శివాలయంలో గురువారం రథోత్సవం నిర్వహించారు. ముందుగా స్వామివారి ఉత్సవ విగ్రహానికి అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పల్లకీలో భాజాభజంత్రీలతో రథం వద్దకు తీసుకొచ్చారు. భక్తుల జయజయ ధ్వానాలు, మేళతాళాల నడుమ రథం ముందుకు కదిలింది. మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వివిధ పార్టీల ప్రముఖ నాయకులు రథోత్సవంలో పాల్గొన్నారు.

ఘనంగా రథోత్సవం..

మరికల్: మండలంలోని తీలేర్ గ్రామంలో తెల్లవారుజామున సహస్ర లింగేశ్వర స్వామి రథోత్సవం నిర్వహించారు. రహదారుల వెంబడి గ్రామస్తులు దర్శించుకున్నారు. అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



రథానికి పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి



తీలేర్‌లో రథోత్సవం నిర్వహిస్తున్న గ్రామస్తులు

ఘనంగా సిద్ధేశ్వర స్వామి ఉత్సవాలు



జాతరలో గాజులు కొనుగోలు చేస్తున్న మహిళలు

మద్దూరు: నాగిరెడ్డిపల్లిలో వెలసిన సిద్ధేశ్వరస్వామి ఉత్సవాలు గురువారం ఘనంగా నిర్వహించారు. రెండు రోజుల పాటు సిద్ధేశ్వర స్వామికి రుద్రాభిషేకం, పల్లకీ సేవ నిర్వహించారు. స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి శివరాత్రి ఉపవాస దీక్షలు విరమించారు. ఆయల కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. అనంతరం అఖండ భజనలు కొనసాగాయి. ఉత్సవాల్లో నాగిరెడ్డిపల్లి, పల్లెర్ల, దమగ్నాపూర్, నాగంపల్లి, మద్దూరు గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

మల్లన్నకు జల్దిబిందె ఊరేగింపు

మద్దూరు: మండల కేంద్రంలోని కావలిగేరిలో మల్లన్న స్వామి ఉత్సవాలు గురువారం ఘనంగా నిర్వహించారు. శివరాత్రి సందర్భంగా బుధవారం రాత్రి జగారం చేసి ఉదయం మల్లన్న కల్యాణం నిర్వహించారు. ఈ సందర్భంగా కురువ డప్పులతో జల్ది ఊరేగింపు నిర్వహించారు. పాతబస్టాండ్ నుంచి జల్ది ఊరేగింపు గ్రామంలో కొనసాగింది. అనంతరం స్వామి అభిషేకం, మల్లన్న కల్యాణం నిర్వహించారు. అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మల్లప్ప, తిరుమలప్ప, భీమప్ప, నర్సింహులు, అంజిలప్ప, సాయిలు పాల్గొన్నారు.



మద్దూరులో మల్లన్న జల్దిబిందె ఊరేగింపు

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం

ఊట్కూరు: మండలంలోని సీపీఎస్ ఉర్దూ మీడియం పాఠశాలలో గురువారం పాఠశాల వార్షికోత్సవం, స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఎం అబ్దుల్‌సలాం, ఉపాధ్యాయులు జరీనాబేగం, జహ్రుద్దీన్, మీర్‌లియాకతుల్లా, నాయకులు అరవింద్‌కుమార్, భాస్కర్, సూర్యప్రకాష్‌రెడ్డి ఉన్నారు.



విద్యతోనే ఉన్నత శిఖరాలు

నారాయణపేట రూరల్: చక్కటి విద్యాబుద్ధులు నేర్చుకుంటేనే ఉన్నత శిఖరాలను చేరేందుకు అవకాశం ఉంటుందని మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ హరినారాయణ్ బట్టడ్ అన్నారు. పట్టణంలోని ఫంక్షన్ హాల్లో నిర్వహించిన శ్రీసాయి కళాశాల వార్షికోత్సవానికి హాజరై మాట్లాడారు. సమయపాలన పాటిస్తూ చెడు వ్యసనాలకు బానిస కాకుండా పరీక్షలకు సిద్ధం కావాలన్నారు. తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కళాశాలలో నిర్వహించిన వివిధ పోటీల విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రామకృష్ణ, కమిటీ సభ్యులు జనార్దన్ రెడ్డి, శంకర్, శశి కుమార్, రఘుపతి రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కోస్గి రూరల్: నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకోని కేసు నమోదు చేసిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. ముంగిమళ్ల గ్రామానికి చెందిన కేచిరెడ్డి మధుసూదన్‌రెడ్డి ముంగిమళ్ల వాగు నుంచి తన సొంత ట్రాక్టర్‌లో ఇసుకతో బయలు దేరాడు. ఈ సమాచారం మేరకు పోలీసులు రామలింగేశ్వర స్వామి దేవాలయం దగ్గర పట్టుకోని స్టేషన్‌కు తరలించారు. కేచిరెడ్డి మధుసూదన్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ బాల్‌రాజ్ తెలిపారు.

బాలకేంద్రాన్ని బాలభవన్‌గా అప్‌గ్రేడ్ చేయండి



నారాయణపేట రూరల్: ఎంతో మంది చిన్నారులను కళాకారులుగా తీర్చిదిద్దుతున్న బాల కేంద్రాన్ని వెంటనే బాల భవన్‌గా అప్‌గ్రేడ్ చేయాలని సూపరింటెండెంట్ మహిపాల్ రెడ్డి కోరారు. గురువారం నారాయణపేటకు వచ్చిన పాలమూరు ఎంపీ డీకే అరుణకు వినతి పత్రం అందించారు. 40 ఏళ్ల నుంచి చిన్నారులకు వివిధ కళాంశాల్లో శిక్షణ ఇస్తున్న పట్టణంలోని బాలకేంద్రాన్ని బాల భవన్‌గా అప్ గ్రేడ్ చేయాలన్నారు. సిబ్బంది జీతాలు పెంచాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు రతంగ్ పాండురెడ్డి, బాలకేంద్రం సభ్యులు సంగ నర్సింహులు, వసంత్‌కుమార్ పాల్గొన్నారు.

హన్మనాయక్ తండాలో ఇందిరమ్మ ఇళ్లకు మార్కింగ్



మద్దూరు: మండలంలోని హన్మనాయక్ తండాలో నలుగురు లబ్ధిదారుల ఇందిరమ్మ ఇళ్లకు అధికారులు గురువారం మార్కింగ్ వేశారు. ఈ తండాను పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేయడంతో 52 ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని, అందులో ఆసక్తి ఉన్న వారు వారి సొంత స్థలంలో ఇళ్లను నిర్మించుకోవాలని హౌసింగ్ డీఈఈ హరికృష్ణ తెలిపారు. పనులు జరిగినట్లు బిల్లులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నర్సింహారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మిషన్ భగీరథ నీరు వృథా..

మాగనూర్: వేసవిలో తాగునీరు సరిపోక ప్రజలు ఇబ్బందులు పడుతుంటే, మండలంలోని అంబేడ్కర్ విగ్రహం సమీపంలో మిషన్ భగీరథ గ్రిడ్ పైప్‌లైన్ లీకై నీరు వృథాగా పోతోంది. సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ఉమ్మడి కృష్ణా, మాగనూర్ మండలాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మక్తల్ నియోజకవర్గంలోని పసుపుల గ్రామం నుంచి మాగనూర్, కృష్ణా మండలాలకు తాగునీటి సరఫరా కోసం ఏర్పాటు చేసిన పైపులైన్ లీకేజీ వల్ల నీటి కలుషితం అవుతోంది. తాగునీటిపై నిర్లక్ష్యం వహిస్తున్న అధికారులపై చర్యలు తీసుకొని, పైప్ లీకేజీకి మరమ్మతు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



ఆజాద్ బాటలో ప్రతి ఒక్కరూ నడవాలి



మక్తల్‌లో ఆజాద్ చంద్రశేఖర్ వర్ధంతిలో పాల్గొన్న మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

- మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

మక్తల్: ఆజాద్ చంద్రశేఖర్ బాటలో ప్రతి ఒక్కరూ నడవాలని మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. గురువారం మక్తల్ పట్టణంలో అజాద్ చంద్రశేఖర్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ఎమ్మెల్యే పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రిటీష్ దొరలకు భయపడకుండా పాలకులకు ఎదురొడ్డిన పోరాట యోధుడు ఆజాద్ అని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ చంద్రకాంత్‌గౌడ్, మార్కెట్‌వైస్ చైర్మన్ గణేష్ కుమార్, మార్కెట్ డైరెక్టర్లు రంజిత్‌కుమార్‌రెడ్డి, శ్రీనివాసులు, కట్టసురేష్, నాగేందర్, శంషొద్దీన్, రవికుమార్, గోవర్ధన్, కుర్మయ్యగౌడ్, పయాజ్, రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఆజాద్ ఆశయాలను కొనసాగిద్దాం..

నారాయణపేట ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని పలు పాఠశాలలో చంద్రశేఖర్ ఆజాద్ వర్ధంతిని పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ మేరకు ఆజాద్ చిత్ర పటానికి పూలమాలాలు వేసి నివాళులర్పించారు. అనంతరం జిల్లా ఉపాధ్యక్షుడు గౌస్ మాట్లాడారు. అనతి కాలంలో భారతమాత బానిస సంకెళ్లు విడిపించి, బ్రిటీష్ వాళ్లను దేశం నుంచి వెళ్లగొట్టాలని పోరాటం చేసి అమరుడైన ఆజాద్ ఆశయాలను కొనసాగించాలన్నారు. వారి పోరాట స్ఫూర్తితో సమాజంలో మెలగాలన్నారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా నాయకులు సురేష్, పవన్‌కుమార్, శ్రీనివాస్, శ్రీకాంత్, అరవింద్, శ్రావణి, చందన, స్పందన, సాయిప్రియ తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న గౌస్

బాలాజీ గుడి అభివృద్ధికి కృషి చేస్తా



ఎమ్మెల్యేను కలిసిన మహేశ్వరి సంఘం సభ్యులు

- ఎమ్మెల్యే పర్ణికారెడ్డి

నారాయణపేట/నారాయణపేట రూరల్: దేవాదాయ శాఖ పరిధిలోని సరాఫ్ బజార్ బాలాజీ మందిర్‌ను అన్ని విధాలా అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పర్ణికారెడ్డి హామీ ఇచ్చారు. గురువారం మహేశ్వరి సంఘం ఆధ్వర్యంలో బాలాజీ మందిర ఆవరణలో దుకాణాల నిర్మాణానికి ఆమె అభ్యంతరం వ్యక్తం చేశారు. పట్టణంలో ఎంతో మంది భక్తులు నిత్యం దైవదర్శనం కోసం వస్తారని, ఆలయ ఉత్సవాలకు స్థల సమస్య ఇబ్బంది కలుగుతుందని ఎమ్మెల్యే తెలిపారు. దేవాలయం అభివృద్ధి చేయాలని 200 మంది మహేశ్వరి సంఘం మహిళలు ఎమ్మెల్యేకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేవాలయం ప్రాంగణంలో ఎవరూ దుకాణాలు నిర్మించరాదని, దేవాలయం అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ హరినారాయణ్ బట్టడ్, దేవాలయం అభివృద్ధికి రూ.5లక్షలు అందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో బాలకిషన్, బద్రి నారాయణ, రాధాకిషన్, హరికిషన్, శ్రీనివాస్, పవన్, హనుమాన్ దాస్, రాజు, లక్ష్మి, గోదావరి, సరిత, పూజ, బబిత పాల్గొన్నారు.

కులాంతర వివాహానికి ప్రోత్సాహం ..

కులాంతర వివాహం చేసుకున్న జంటకు ప్రభుత్వం ప్రోత్సాహక బహుమతి అందిస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పర్ణికారెడ్డి అన్నారు. కులాంతర వివాహం చేసుకున్న ఎక్లాస్‌పూర్ గ్రామానికి చెందిన నవనీత, రాజ్‌కుమార్, ఉలిగుండ గ్రామానికి చెందిన ప్రియాంక, హనుమదాస్ దంపతులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. వారికి ప్రభుత్వం నుంచి ప్రోత్సాహకం మంజూరు కావడంతో ఒక్కో జంటకు రు.2.50 లక్షల చెక్కులను లబ్ధిదారులకు ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి కజ్జం ఉమాపతి, డీఎస్‌డీఓ కార్యాలయ సిబ్బంది పూజారి నర్సింహులు, వసంత్ కుమార్, తదితరులు ఉన్నారు.

తిరుమలకు భక్తుల పాదయాత్ర



పాదయాత్రగా వెళ్లే భక్తులకు సన్మానం చేస్తున్న నారాయణరెడ్డి

నారాయణపేట రూరల్: మండలంలోని శాసన్‌పల్లి గ్రామానికి చెందిన తిరుమల తిరుపతి పాదయాత్ర సమితి భక్త బృందం గురువారం తిరుపతి వేంకటేశ్వర స్వామి సన్నిధికి పాదయాత్రగా భయలుదేరారు. ఈ సందర్భంగా నారాయణపేటలో రెడ్డి ఎలక్ట్రికల్ వర్క్స్ నిర్వహకుడు సత్యసాయి భక్తుడు నర్సింహారెడ్డి పాదయాత్రకు బయలుదేరే వారిని శాలువాతో సత్కరించి, నగదును కానుకగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాసన్‌పల్లి గ్రామానికి చెందిన 25 మంది భక్తులు ఏటా పాదయాత్ర చేయడం సంతోషనీయమన్నారు. 21 ఏళ్లుగా పాదయాత్ర చేస్తున్నారని తెలిపారు. 11 రోజుల పాటు పాదయాత్ర అనంతరం తిరుమలలో స్వామిని దర్శించుకోనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బాలకృష్ణ, మహాదేవప్ప, రాములు, సింగారం వెంకటప్ప, పి.లక్ష్మణ్, వి. లక్ష్మణ్, రమేష్, నారాయణరెడ్డి, కన్కప్ప, నక్కచందు, మహేష్, రాంలింగం, కోప్రెస్‌చారి ఉన్నారు.

రక్తదానం.. ప్రాణదానం వంటిది

ఊట్కూరు: మండలంలోని నిడుగుర్తి గ్రామంలో గౌరీశంకర బ్రహ్మోత్సవాలలో భాగంగా వివేకానంద యూత్ ఆధ్వర్యంలో గురువారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ కృష్ణంరాజు మాట్లాడుతూ రక్తదానం చేయడం వల్ల ఆపదలో ఉన్నవారి ప్రాణాలు కాపాడిన వారు అవుతారని అన్నారు. ప్రమాదం జరిగినప్పుడు సకాలంలో సరైన రక్తం దొరకక చాలామంది చనిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 31 మంది యువకులు శిబిరంలో రక్తదానం చేశారు. కార్యక్రమంలో ప్రశాంత్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, మోనేష్, కృష్ణ, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



రక్తదాన శిబిరంలో మాట్లాడుతున్న ఎస్ఐ కృష్ణంరాజు

కులం పేరుతో దూషించిన వారిపై చర్యలు తీసుకోవాలి

మద్దూరు: దళిత మహిళల పట్ల కులం పేరుతో దూషించిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. గురువారం మద్దూరులోని ప్రెస్‌క్లబ్‌లో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. దళిత సంఘాల ఆధ్వర్యంలో కొత్తపల్లి మండలంలోని అల్లీపూర్ గ్రామంలో జరిగిన సంఘటనపై పరిశీలించామన్నారు. అక్కడ పాఠశాల కమిటీ చైర్మన్‌గా ఉన్న దళిత మహిళ వెంకటమ్మను అదే గ్రామానికి చెందిన ఎల్లప్ప కులం పేరుతో దూషించడంతో పాటు, కుటుంబాన్ని భయభ్రాంతులకు గురిచేశాడని తెలిపారు. అక్కడ స్కావెంజర్‌గా పనిచేస్తున్న కొండప్పను కూడా కులం పేరుతో దూషించినట్లు పేర్కొన్నారు. పోలీసులు పూర్తిస్థాయిలో విచారణ చేసి బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు చిన్నయ్య, ప్రభుదాస్, రాజు, నరేష్, నర్సింహులు, ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న దళిత సంఘాల నాయకులు